


# నల్లమిల్లి పెదభూమిరెడ్డిగారి తీర్పు

కోర్టులో గెలవడంతో ఆదిరెడ్డిగారి మండువాలోగిలి, తాడిసూరెడ్డిగారబ్బాయి కెళ్ళిపోయిందట. సామాన్లన్నీ ఆరుబళ్ళలో సర్దుకుని ఊరు విడిచి అద్దరికి వెళ్ళిపోతున్నారు ఆదిరెడ్డిగారి కుటుంబీకులు.

తన హోటలు పాక ముందు నిలబడి ఎద్దులు బరువుగా లాగుతున్న ఆ బళ్ళకేసి, వాటి లోపలున్న ఆడోళ్ళకేసీ చూసిన కిళ్ళీరన్న "ఎదవ కోర్టులూ ఎదవ గొడవలూనూ నా చిన్నప్పుడు ఈ ఊరి జనం కోర్టులకీ పోలీసుటేషన్లకీ ఎళ్ళేవోరేంటి?" అన్నాడు.

"మరిగొడవలొస్తే తగువులెవరు తీర్చేవోరు?" అడిగేడు అన్నపూర్ణప్పగారి అల్లుడు ఆదిరెడ్డి.

మబ్బులు పట్టిన ఆకాశంకేసి చూసి దణ్ణం పెట్టుకుంటా "ఆ మహానుభావుడు... నల్లమిల్లి పెదభామిరెడ్డిగారు" అన్నాడు కిళ్ళీరన్న.

"ఆయనెవరు?" అర్థంగాలేదు మాకెవరికీ.


"ఉండేవోర్లే... ఇప్పుడారి వంశీకులెవరూ కూడా ఈ ఊళ్ళో లేరు... కానీ పెదభామిరెడ్డిగారి తీర్పు ముందు అసలీ ఏరియాలో ఎవరు పనికొస్తారు?" అన్నాడు.

చిరాకుపడ్డ ఆదిరెడ్డి "అబ్బా... అలా ఊరించకపోతే ముచ్చుకి ఒకటి చెప్పగూడదూ?" అన్నాడు.

"ముచ్చుకేటి మధ్యలో అడ్డు రాకుండా వింటానంటే మొత్తం చెపుతాను" అని మొదలెట్టాడు కిళ్ళీరన్న.

* * *

నల్లగా బాగా ఎత్తుగా పుష్టిగా ఉండే నల్లమిల్లి పెదభామిరెడ్డిగారు రోజు మొత్తం మీద చాలా తక్కువ మాటాడతాడు. ఆయనంటే చాలా మందికి భయం. ఆయన



తీర్పంటే అందరికీ అయిదోవేదం. ఆయనకి బుచ్చిరెడ్డి అనే కొడుకూ, శివాలక్ష్మి అనే కూతురూ ఉన్నారు. వెనకటికెప్పుడో అర్ధరూపాయి బిళ్ళంత మచ్చ అరచేతిలో లేచింది శివాలక్ష్మికి. రామచంద్రపురంలో ఆడ డాక్టరుగారికి చూపిస్తే "బొల్లి" అన్నారు. ఇక అక్కడ్నించి పాకడం మొదలెట్టి ఇప్పుడు ఒళ్ళంతా తెల్లగా అయ్యిపోడంతో ఇంట్లోంచి అసలు బయటికి రావడం మానేసిందా శివాలక్ష్మి.

ఎంత కట్నమిస్తానన్నా చేసుకోడానికెవరూ ముందుకి రావడం లేదు. ఆఖరికి లేవరకంతో పొట్టతిప్పలు పడ్తున్నోళ్ళ కుర్రోళ్ళుకూడా ''వద్దుబాబోయ్'' అని పారిపోతున్నారు. దాంతో పెదభామిరెడ్డిగారికి సమస్యయిపోయింది శివాలక్ష్మి పెళ్ళి. ఆయన భార్య వీరమ్మగారయితే బెంగెట్టేసుకుంది.

వాళ్ళా అవస్థల్లో ఉండగా కోనాలోళ్ళ సాయిబాబురెడ్డి ''మీ శివాలక్ష్మిని నేను చేసుకుంటాను'' అనేసి కబురెట్టాడు. ఇంత అందగాడివి మా శివాలక్ష్మిని చేసుకోడానికి కారణమేంటని భామిరెడ్డిగారడిగితే ''తీర్పు లివ్వడంలో ఆ ఏరియాలో గొప్ప పేరెల్లిన పెదభామిరెడ్డిగారి అల్లుడవడం గొప్ప అదృష్టంగదా అందుకే జేసుకుంటానంటున్నాను'' అన్నాడు.

* * *

ప్రతి ఏడూలాగే ఆ ఏడుకూడా శ్రీకాకుళంనించి కోతలు కొయ్యడానికొచ్చే తూర్పోళ్ళు కాలవ దగ్గర సత్రంలో దిగేరు. అయితే ఈ ఏడాది ఆ వచ్చినోళ్ళలో రంభలాంటి పిల్లొకర్తుంది. ఊళ్ళో ప్రతివాళ్ళ కళ్ళు ఆ పిల్ల మీదే. కొందరయితే సత్రం దగ్గరికి పని గట్టుకుని మరీ వెళ్ళి చూసొస్తున్నారు. పేరు సుంకి అంట.

ఆ వేళ అమావాస్య. ఊళ్ళో అయిదుగురు కుర్రోళ్ళు సత్రంలో సన్నగా గురకెట్టి నిద్రోతున్న సుంకి నోట్లో గుడ్డలు కుక్కేసి కోరిగవర్రెడ్డిగారి చెరుకుతోటలోకి లాక్కెళ్ళిపోయి ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు పాడుచేసారా పిల్లని.

చాలా పెద్ద గొడవే చేసింది సుంకి. ఊళ్ళో పెద్దల ముందు పెట్టింది. అసలు తనని పాడు చెయ్యాలన్న పాడు ఆలోచనొచ్చింది సాయిబాబు రెడ్డికంట. అతనే తక్కిన నలుగురు కుర్రోళ్ళనీ పోగేసి రెచ్చ గొట్టేడంట.

జమ్మిచెట్టు చుట్టూ కట్టున్న సిమెంటు చీడీ మీద కూర్చున్నాడు పెదభామిరెడ్డిగారు. ఆయన ముందు అయిదుగురు కుర్రాళ్ళు, వాళ్ళకి కాస్త దూరంగా సుంకి. ఇక ఇళ్ళ అరుగుల మీద జమ్మిచెట్టెనకాల గుళ్ళోనూ ఒకటే జనం.

జరిగిందంతా సుంకి నోటమ్మట ఇంకోసారి విన్న పెదభామిరెడ్డిగారు అయిదుగురు కుర్రాళ్ళకేసీ చూస్తే ''ఆ తప్పు మేమే చేసేం'' అని ఇంకోసారి ఒప్పుకున్నారు వాళ్ళు.

ఆనాకో రేపో తన బొల్లి కూతురుకీ కాబోయే మొగుడూ తన అల్లుడు సాయిబాబురెడ్డిని ఇంకోసారడిగితే ''అవును వీళ్లకి నాయకుడ్ని నేనే'' అన్నాడు.

మూసుకున్న కళ్ళని కాసేపటికి విప్పిన పెదభామిరెడ్డిగారు ''అయితే ఈ సుంకి మెళ్ళో నువ్వు తాళి కట్టాలి'' అని తీర్పివ్వడమే గాకండా ఆ పెళ్ళి దగ్గరుండి జరిపించేడు.

* * *

అమావాస్య ఆ వేళ. గోదారి కాలవలో గాలి బాగానే వీస్తుంది. ఫుంతరేవులో ఎవరో స్నానం చేస్తున్నారు.

బల్లకట్టు అవతలి ఒడ్డున కట్టేసుంది. దాన్ని నడిపే తాతాలు పాకలో కూడొండు కుంటున్నాడు. ఎండుచేపల ఇగురనుకుంటాను. ఘుమఘుమలాడిపోతుంది వాసన.

బల్లకట్టు ఎక్కడానికి చాలా మంది జనమున్నారు. వాళ్ళ మధ్యలో ఉన్న పోతంశెట్టి వీరెడ్డి ''ఒరేయ్ తాతాలూ రారా ఎదవ తొత్తు కొడకా'' అనరిచేడు.

అలాగ ఒక పుంజీడు సార్లు అరిపించుకున్నాక బల్లకట్టు మీదెక్కి గెడేసేడు తాతాలు.

బల్లకట్టు ఈ ఒడ్డునాగింది. అంతా ఎక్కేక తీగలాగి గెడేసిన తాతాల్ని "ఏం కూర్రా వాసన మాసారం దాకా వస్తంది" అన్నాడు నర్సిరెడ్డి. "ఆయ్... సొవిడుం ఇగురండి" అన్నాడు తాతాలు.

"మరి పప్పుచారు కూడా కాసెయ్యలేక పోయావా మంచి సవాదిగా ఉంటదీ" అని వీరారెడ్డి అంటే "పొద్దున్న కాసింది ఉందండి మిమ్మల్ని దించేక వేడి చేసుకుంటాను" అన్నాడు.

చీకట్లో బల్లకట్టు ఎక్కిన వాళ్ళందరినీ పేరు పేరునా అడుగుతున్నాడు. ఎవరితాలూకూ ఏంటీ? అని. తననెక్కడ అడిగేస్తాడో అని ఒకటే కంగారు ఎఱ్ఱనూకరాజుకి. చలిలో చెమట్లు పట్టేస్తున్నాయి.

మొత్తానికెలాగయితేనేం కాలవ అవతల గట్టెక్కేసి పొలాల్లోంచి నడుచుకుంటా వెళ్ళేసరికి తన కోసమే ఎదురుచూస్తా ఉన్న బుచ్చిరెడ్డి "ఏంటాలిస్సెం?" అన్నాడు.

జరిగిందంతా చెప్పి "ఏదో రోజున ఎవడికంట్లోనో పడకమానం మనం" అంటుండగా నర్సిరెడ్డిగారి పాలేరు పుత్రయ్య "ఎవరక్కడ?" అన్నాడు. మాటాడ్లేదు ఇద్దరూ.

"ఎవరా చీకట్లో అంటన్నాను" అనరిచేసరికి మావిడితోటలోకి పారిపోయేరు.

బుచ్చిరెడ్డిని గుర్తు పట్టేసిన పుత్రయ్య "ఎల్లేది భామిరెడ్డిగారబ్బాయి గదూ... ఇదిగో అబ్బాయిగారూ బుచ్చిరెడ్డిగారూ" అనరుస్తుంటే ఆగి వాడికి సమాధానం ఇవ్వకండా ఎఱ్ఱనూకరాజుతో పాటు పరుగెడ్తున్నాడా చీకట్లో.

"ఇదిగో అబ్బాయిగారూ బుచ్చిరెడ్డికాపుగారూ చీకట్లో ఆ ఆడమనిషెవరండీ" అంటుంటే తెగ జడిసిపోయిన ఎఱ్ఱనూకరాజు "దేవుడా అన్నారం సత్యన్నారాయణమూర్తీ..తండ్రీ ఆ మనిషి ఊళ్ళో చాటకండా కాపాడు. పెదభామిరెడ్డిగారికి చెప్పకండా చూడు స్వామి... ఈ సాయం నువ్వు జేస్తే నీ కొండ కొచ్చి తలనీలాలిచ్చుకుంటాను" అని మొక్కేసుకుని ఇంటికెళ్ళేకా ముడుపు కట్టేసింది.

* * *

ఆ పల్లెటూళ్ళో పగలు ఎక్కడ కల్సుకున్నా ఊళ్ళో ఎవళ్ళో ఒకళ్ళు చూసేస్తారు ఆ తర్వాత పెంట పెంటయిపోద్ది. కాబట్టి ఒక అమావాస్య రోజే గతి. అదీ ఊరు దాటాకా ఎక్కడో కల్సుకోవాలి. వాళ్ళిద్దరూ అమావాస్యకోసారి కల్సుకుంటున్నారు.

ఆరోజు అమావాస్య.

ఆకాశం నిండా మబ్బులు పట్టేస్తున్నాయి. చల్లటిగాలి సుళ్ళు తిరుగుతా వీస్తుంది. వర్షంగానీ వస్తదేమో అన్పిస్తుంది.

లాకుల కిందకెళ్ళి భాస్కరమ్మగారింటి పక్కనించి కాకివారి సావరం మీదుగా నడుచుకుంటా వెళ్తున్న ఎఱ్ఱనూకరాజు పొలాలకి అడ్డం బడతా చెల్లూరు ఫేక్టరీకి పసలపూడికీ మధ్యలో ఉన్న చింతావారి దూళ్ళ సావిట్లో కొచ్చేసరికి మొదలైంది వర్షం.

ఎఱ్ఱనూకరాజు వెళ్ళేసరికి గడ్డి తింటన్న దూళ్ళ మధ్యలో చిన్ని కృష్ణుడిలాగ పడుకుని ఉన్నాడు బుచ్చిరెడ్డి.

ఆ మాటా ఈ మాటా అయ్యేక ఒకళ్ళ శరీరానికి ఇంకొకళ్ళ శరీరం తగిలినప్పుడు పుడ్తున్న వేడిని అనుభవించేసేలోపే బేటరీ లైటు కాంతి వాళ్ళమీద పడింది.

చూస్తే, సూర్రెడ్డి.

ఒక్క ఊపున లేచిన ఆ ఇద్దరూ బోరుమని కురుస్తున్న వర్షంలోనే తడుచుకుంటా పారిపోయేరు.

ఈ దెబ్బకి బెదురు చీమలాగయిపోయిన ఎర్రనూకరాజు ''అమ్మా తల్లుల్లారా ఆ సూరెడ్డి ఊళ్ళో ఎవరికీ చెప్పకండా కాపాడండి'' అంటా మట్లపాలెం మాలక్ష్మమ్మకీ ఆలమూరు ఏటిగట్టునున్న వరాల దుర్గమ్మకీ,మురమండ ముత్యాలమ్మకీ ముడుపులు కట్టేసింది.

* * *

అద్దరి నించొచ్చిన దొంగొకడు ఊరి మధ్యలో ఉన్న రాములోరి గుళ్ళో పెద్ద కంచుగంటని దొంగతనం చెయ్యబోతుంటే చూసిన పాలేరు సత్తుం పరుగెత్తుకెళ్ళి ఆ దొంగోడి నడుంచుట్టూ చేతులు చుట్టేసి ఉడుం పట్టు పట్టేసేడు.

తిరగబడ్డ ఆ దొంగసత్తుం కుడి చెయ్యి పట్టుకుని గిరిగిరా తిప్పేస్తుంటే విరుగుతున్న ఎముకల చప్పుడు కరకరమంటా వినిపించింది. దాంతో సత్తుంగాడు పెట్టిన పొలికేకలకి వీధిలో జనమంతా వచ్చేసేరు.

మర్నాడు సాయంత్రం జనమంతా జమ్మిచెట్టు దగ్గర పోగయ్యేరు.

జరిగిందంతా విన్న పెదభామిరెడ్డిగారు బక్క పల్చగా ఉన్న దొంగోడి కేసి తిరిగి ''ఏవూరు మీది?'' అన్నారు.

''గోదారవతల పదోమైలురాయి జంక్షను'' తల బిరుసుగా చెప్పేడు సమాధానం.

''గుళ్ళోగంట ఏ చేత్తో వాయిస్తారు?'' అడిగేరు భామిరెడ్డిగారు.

''ఆ మాత్రం తెల్దా... కుడిచేత్తో'' అన్నాడు దొంగోడు.

''నిన్ను పట్టుకున్న ఆ సత్తుంగాడి ఏ చెయ్యి విరిచేవు?''

''కుడిచెయ్యి''.

అందరికేసి ఒక్కసారి తలతిప్పి చూపుని తనతో పాటు కూర్చున్న తక్కిన పెద్దల దగ్గర ఆపిన పెదభామిరెడ్డిగారు ''ఈ దొంగోడి కుడిచెయ్యి నరికించెయ్యండి''అని లేచెళ్ళిపోయారు.

* * *

చింతాలమ్మగుడి దగ్గర ఎదురైన పాలేరు పుత్రయ్య ''అబ్బాయిగారూ మొన్న మా పొలంలో కొట్టుకొచ్చిన ఆ టిక్కెట్టు ఎవరండీ... నేను తమరి నాన్నగారికి చెప్పనులెండి'' అని కెలకడం మొదలెట్టాడు.

జమ్మిచెట్టు దగ్గరకి పనుండి వెళ్తూన్నప్పుడు ఎదురైన సూరెడ్డి ''ఆ ఆడమణిషి ఎర్రనూకరాజు గదా?'' అన్నాడు. ఆ తర్వాత మాటాడిన అతని మాటా తీరూ చూస్తుంటే ఆనాకోరేపో మీనాన్నకి చెప్పేస్తాననట్టున్నాయి.

ఇక్కడ్నుంచి ప్రతీరోజు రకరకాల తీర్పులిచ్చే తన తండ్రి చాలా కఠినమైన తీర్పు చెప్పినట్టు అది చూసి భరించలేక వాళ్ళమ్మ ఉరేసుకుని చచ్చిపోయినట్టూ, చెల్లెలు శివాలక్ష్మయితే గన్నేరు పప్పు తినేసి, పోయినట్టు రకరకాల పీడకలలు వస్తున్నాయి.

కొన్నాళ్ళు గడిచాయి. ప్రతిరోజూ అవే కలలు. ఇక ఆ హింసని భరించలేకపోతున్న బుచ్చిరెడ్డి వాళ్ళ నాన్న దగ్గరకెళ్ళి జరిగింది చెప్పేద్దామన్న నిర్ణయానికొచ్చేసేడు.

దీపాలవేళదాటింది.

తల మీంచి చన్నీటిస్నానం చేసొచ్చిన పెదభామిరెడ్డిగారు కంచం ముందు కూర్చున్న వెంటనే వేడివేడి అన్నంకూరలూ వడ్డించింది వీరమ్మగారు.

భోజనం చేసి పెరట్లో కొచ్చేసరికి నూతిపళ్ళెం పక్కన నవారు మంచం మీద పరుపూ దానిమీద నల్ల బిన్నీ దుప్పటి పరిచి ఉన్నాయి. చుట్ట వెలిగించి కాస్సేపు పచార్లు చేసి ఇక మంచం మీద నడుం వాల్చబోతుండగా ''నాన్నా'' అన్న బుచ్చిరెడ్డి మాట వినిపించి అటు చూసేడు.

చీకట్లో ఆకు సంపెంగ చెట్టుకింద నిలబడున్న బుచ్చిరెడ్డి. ఒకో అడుగూ వేసుకుంటూ తండ్రి ముందుకొచ్చి ''నా... న్నా..''అన్నాడు.

ఏంటన్నట్టు చూసేడు పెదభామిరెడ్డి.

''ఏం లేదు నాన్నా'' అన్నాడు.

''ఏం లేదా? ... మరా కంగారేంట్రా?'' అడిగేడు భామిరెడ్డి.

''ఏం ..లేదు న్నాన్నా..సరోజినమ్మా తెల్సుగదా వాళ్ళమ్మాయి ఎర్రనూకరాజూ నేనూ... తనూ నేనూ... ప్రేమించుకున్నాం నాన్నా...''

''ఏంటి?'' కళ్ళు గట్టిగా మూసేసుకున్న బుచ్చిరెడ్డి ''ఎర్రనూకరాజూ నేనూ ప్రేమించుకున్నాం నాన్నా''.

అర్థమైపోయింది పెదభామిరెడ్డికి. ఏం మాటాడలేదా చీకట్లో.

''ఈ వార్త ఆనాకో రేపో నీ చెవిన పడేలాగుందని నేను ముందు వచ్చి చెపుతున్నాను నాన్నా, తీర్పు మరీ కష్టంగా గాకండా నాకు తేళుం సులువుగా ఇయ్యి నాన్నా'' అని పాఠం అప్పగించినట్టు అప్పగించేసి ఏదో అర్జంటు పనున్నట్టు పరుగులాంటి నడకతో వెళ్ళిపోయేడు బుచ్చిరెడ్డి. మంచం మీంచి లేచిన పెదభామిరెడ్డి వాకిట్లో కల తిరగడం మొదలెట్టాడు.

అది చూసిన వీరమ్మగారు ''ఎప్పుడూ లేంది ఇవేళ ఏంటీయన తంతు?'' అనుకుంది.

అలా ఎన్నో గంటలసేపు కల తిరిగిన పెదభామిరెడ్డి అర్ధరాత్రి పన్నెండు దాటాకా కొడుకు బుచ్చిరెడ్డి గదిలోకెళ్ళి గురకపెట్టి నిద్రపోతున్న అతని మీద చెయ్యేసేసరికి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు బుచ్చిరెడ్డి.

''వూరి జనం రేపు నీ గొడవ నాకు చెప్పి తీర్పు ఇమ్మంటే... నేనిచ్చే తీర్పు చాలా కఠినంగా ఉంటుంది. దాన్ని నువ్వు ఏమాత్రం భరించలేవు'' అన్నాడు భామిరెడ్డిగారు.

''నాన్నా'' అన్నాడు బుచ్చిరెడ్డి. ''అవును... కాబట్టి వెంటనే బట్టలు సర్దేసుకుని ఈ రాత్రికి రాత్రే ఆ ఎర్రనూకరాజుతో పాటు ఈ ఊళ్ళోంచి పారిపో'' అంటున్న భామిరెడ్డికేసి కనుగుడ్లు పెద్దవి చేసి చూస్తుండిపోయేడు బుచ్చిరెడ్డి.

''అవును... వెంటనే వెళ్ళిపో. రేపొద్దుట నువ్వు ఆ పిల్లతో లేచిపోయిన సంగతి తెల్సిన ఊరోళ్ళు ఫలానా తీర్పులిచ్చే భామిరెడ్డిగారి కుర్రోడు ఫలానా వాళ్ళ పిల్లతో లేచిపోయాడని చెప్పుకుంటారు... నాకు చాలా పెద్ద పేరొస్తుంది. దాన్ని నేను భరిస్తాను. కానీ, నువ్విక్కడే ఉంటే నేనివ్వబోయే ఆ కఠినమైన తీర్పుని నువ్వు భరించలేవు. కాబట్టి వెంటనే బయల్దేరు. ఆ పిల్లతో పాటు ఈ ఊళ్ళోంచి లేచిపో'' అనేసి నూతిపళ్ళెం దగ్గరున్న తన మంచం దగ్గరకెళ్ళిపోయేడు నల్లమిల్లి పెదభామిరెడ్డిగారు.

* * *